సాక్షి మంచిర్యాల

గురువారం : 17 ఆగస్టు 2023



శ్రావణం.. శుభప్రదం
హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం అత్యంత పవిత్రమైనది. గురువారం నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభమవుతుండగా సెప్టెంబర్ 15తో ముగియనుంది. 8లో▸



ఈసారికి 'ఇంజినీరింగ్' లేనట్టే!
జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తానని సీఎం కేసీఆర్ నిర్మల్ సభలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాకు ఈసారికి అవకాశం లేకపోయింది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం **32.0 /26.0**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కుష్ఠువ్యాధిని నిర్మూలించాలి



మిట్టపల్లిలో ప్రారంభిస్తున్న సుబ్బరాయుడు

జైపూర్: కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని, ఎవరికైనా శరీరంపై మొద్దుబారిన మచ్చలు కనిపించినా వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం–2023 కార్యక్రమాన్ని ఎంపీపీ గోదారి రమాదేవి, స్థానిక సర్పంచ్ కుంటాల సౌజన్యతో కలిసి జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 20ఇళ్ల చొప్పున ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు గ్రామాల్లో సర్వే చేయాలని సూచించారు. వచ్చే నెల 31వరకు అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ సర్వే చేపడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ వైద్యాధికారి అనిల్‌రావు, వైద్యులు ఫయాజ్, పారామెడికల్ అధికారులు శివకుమార్, రాఘవయ్య, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ వసుమతి, మల్లేశ్, ఆశాలు పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి ఆలయానికి నిధులు మంజూరు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల విశ్వనాథ దేవస్థానం పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మదాయశాఖ సర్వశ్రేయో నిధి(సీజీఎఫ్) నుంచి రూ.1.97 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి కాగానే పనులు చేపట్టనున్నారు. 1967లో విశ్వనాథస్వామి దేవస్థానం నిర్మించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణ సాగుతోంది. ఆలయంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి, శివపార్వతులు, వినాయకుడు, కన్యకాపరమేశ్వరి, ఆంజనేయుడు, నవగ్రహాల విగ్రహాలు భక్తులకు దర్శనమిస్తాయి. ఆయా ఆలయాలు నిర్మించి 60ఏళ్లకు పైబడి కావడంతో పెచ్చులూడి భక్తులకు గాయాలయ్యాయి. పురాతన ఆలయాల స్థానంలో నూతన నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారని ఈవో ముక్తా రవి తెలిపారు.

బీజేపీని వీడే ప్రసక్తే లేదు : మాజీ ఎంపీ వివేక్



గొడుగులను పంపిణీ చేస్తున్న వివేక్

వేమనపల్లి: బీజేపీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గొడుగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలతోపాటు గిరిజన ఆశ్రమ పాఠశాలలో పేద విద్యార్థులకు 320 గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కావాలనే తాను పార్టీ మారుతున్నానని అసత్య ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెంకన్న కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఏట మధుకర్, తలండి రమేష్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, నాయకులు అందుగుల శ్రీనివాస్, వెంకటకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

19న జిల్లాలో 5కే రన్

నస్పూర్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న జిల్లాలో ఐ ఓట్ ఫర్ షూర్ అనే నినాదంతో నిర్వహించనున్న 5కే రన్ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే రన్‌లో ఎన్నికల, సహాయ ఎన్నికల, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

19న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధికల్పనాధికారి కార్యాలయంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో లోన్ ఆఫీసర్ 100 పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఏదేని డిగ్రీ అర్హత గల 28ఏళ్లలోపు యువతీ, యువకులు హాజరు కావచ్చని, మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని, 9111731173లో సంప్రదించాలని తెలిపారు.

'ప్రైవేట్' చేతిలో రైల్వే సొమ్ము!



బెల్లంపల్లి రైల్వేస్టేషన్

- స్టేషన్ల ఆదాయం జమ చేస్తున్న ఏజెన్సీ
- బెల్లంపల్లిలో రూ.34.16లక్షలు పక్కదారి
- తేడాలు వస్తే సొంత సిబ్బందిపైనే వేటు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైల్వే ఆదాయ పర్యవేక్షణలో లోపాలు బయటపడ్డాయి. రూ.లక్షలు పక్కదారి పట్టినా గుర్తించడం క్లిష్టంగా మారింది. ప్రైవేటు ఏజెంటు మోసం చేసినా చివరికి రైల్వే సిబ్బంది ఉద్యోగాలకే ఎసరు వస్తోంది. ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వేస్టేషన్ టికెట్ల డబ్బులు ఓ వ్యక్తి తన సొంతానికి వాడుకోవడం లోపాలను ఎత్తి చూపుతోంది. గత జనవరి ఒకటి నుంచి జూలై 20 మధ్య 21సార్లు మొత్తంగా రూ.34.16లక్షలు బ్యాంకులో జమ చేయకున్నా చేసినట్లు నమ్మించాడు. ఆ డబ్బు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేశాడు. ఏడు నెలలపాటు ఎవరూ గుర్తించకపోవడం రైల్వేలో ఉన్న లోపాన్ని తెలియజేస్తోంది. స్థానిక కమర్షియల్ సెక్షన్ అధికారి అనుమానంతో ఏజెంటు ఇచ్చిన రశీదులో బ్యాంకు స్టాంపుల్లో తేడాపై ఆరా తీయగా ఈ వ్యవహారం బయటపడింది. అక్కడి బుకింగ్ అధికారి స్టాంపులు సరిచూసుకోలేదనే కారణంతో వారిపై వేటుకు రంగం సిద్ధమైంది. ఇక మోసం చేసిన ఏజెన్సీ ఉద్యోగిపై ఈ నెల 10న బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై విచారణ సాగుతోంది.

రోజువారీగా బ్యాంకుల్లో జమ

రెండేళ్ల క్రితం వరకు రోజువారీగా ప్రయాణికుల టికెట్లు, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని సొంత ఉద్యోగులే నేరుగా వెళ్లి బ్యాంకుల్లో జమ చేసేవారు. ఇందుకోసం రవాణా చార్జీలు చెల్లించేవారు. గతేడాది నుంచి రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో ప్రైవేటు ఏజెంట్లు వచ్చి చేరారు. ఎస్‌బీఐ ప్రవేశపెట్టిన "డోర్ స్టెప్ బ్యాంకింగ్"తో వారి ఏజెంట్లే స్టేషన్లకు వచ్చి డబ్బులు తీసుకుని రైల్వే ఖాతాలో జమ చేస్తున్నారు. ఇందుకు 2020లోనే స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా, రైల్వే మధ్య ఎంవోయూ (మెమొరాండం ఆఫ్ అండర్ అండర్ స్టాండింగ్) కుదిరింది. కోవిడ్‌తో జాప్యం జరిగి గతేడు జనవరి నుంచే ఈ విధానం అమలవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం ఎస్‌బీఐ తరఫున సీఎంఎస్(క్యాష్ మేనేజ్‌మెంటు సిస్టం) ఏజెన్సీకి స్టేషన్ మాస్టర్, బుకింగ్ సూపర్‌వైజర్ల నుంచి రోజువారీగా వచ్చిన ఆదాయాన్ని అప్పగించాలి. ఏజెంట్లు ఆ డబ్బులు జమ చేసినట్లు రశీదు తెచ్చి ఇవ్వాలి. రశీదులతోనే డబ్బులు జమ అవుతున్నట్లు పోల్చుకుంటున్నారు. బెల్లంపల్లి స్టేషన్‌లో బ్యాంకులో నగదు జమ చేయకున్నా ఓచర్లపై నకిలీ స్టాంప్ వేసుకుని వస్తూ పలు దఫాలు డబ్బులు వాడుకున్నాడు. ఇది అక్కడి వారు గుర్తించలేకపోయారు. ఇదే తీరుగా ఏ స్టేషన్‌లోనైనా ప్రమాదం ఉంది. ప్రతీరోజు సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, విజయవాడ, గుంతకల్, గుంటూరు డివిజన్లలోని మొత్తం715స్టేషన్లు ఉండగా, వీటిలో 585స్టేషన్లలో ఏజెంట్లే నగదు తీసుకెళ్తున్నారు. ఇక్కడ సగటున రోజుకు రూ.6.56కోట్లు సమకూరుతోంది. నగదు బ్యాంకుల్లో జమ చేసినందుకు గాను బ్యాంకుకు నెలకు రూ.55.35లక్షలు రైల్వే చెల్లిస్తోంది.

సరిచూసుకోవడమూ కష్టమే

సౌత్ సెంట్రల్ మొత్తానికి ఒకే అకౌంట్ 'రైల్ శక్తి' ఉంది. ఏ స్టేషన్ నుంచైనా ఇదే అకౌంట్‌లో జమ అవుతున్నాయి. ఎక్కడైనా లోపం ఏర్పడితే ఎక్కడ, ఎవరు, ఎంత మొత్తంలో జమ చేశారో తెలుసుకోవాలంటే క్లిష్టంగా మారింది. ఏదైనా ఓ ఓ స్టేషన్ నుంచి ఒక రోజు డబ్బులు రావాల్సిన మొత్తం జమ కాకపోతే, వెంటనే గుర్తించే వ్యవస్థ లేదు. దీంతో నెలల తరబడి డబ్బులు రాకున్నా గుర్తించలేక పోతున్నారు. అటు బ్యాంకు అధికారులు ఇటు రైల్వే అధికారులు కూడా కచ్చితమైన పర్యవేక్షణ చేయకపోవడంతో రూ.లక్షలు పక్కదారి పట్టినా బయట పడలేదు. ఇది బెల్లంపల్లిలోనే ఇలా జరిగిందా? ఇంకా ఎక్కడైనా ఇలాంటివి ఉన్నాయా? అనే కోణంలోనూ పరిశీలనలు చేస్తున్నట్లు సమాచారం.

ఓటరు నమోదు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్: రాష్ట్ర వ్యాప్తంగా నూతన ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి స్థాయి కార్యాచరణ రూపొందించుకుని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర సంయుక్త ముఖ్య ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై చునావ్ పాఠశాలలు, ఎలక్ట్రో లిటరసీ క్లబ్స్, శిబిరాల నిర్వహణ ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటు వేసే విధానంపై, ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కేంద్రాలు నిర్వహించాలని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ఉదయం 6 గంటలకు ఐ ఓట్ ఫర్ షూర్(నేను కచ్చితంగా ఓటు వేస్తాను) అనే నినాదంతో 5 కే రన్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, ఎన్నికల డీటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సమ్మె



మంచిర్యాల ఐబీ చౌరస్తాలో సమ్మె చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

- ఎంపీహెచ్(ఎఫ్)ల నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్
- కొన్నేళ్ల నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు
- పర్మినెంటు చేయాలని ఆందోళన
- టీకాలు, సీజనల్ వ్యాధుల సమయంలో ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(ఎఫ్)(మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్))గా ఉన్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, ఎంపీహెచ్ఏ(ఎఫ్) నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న కాంట్రాక్టు సెకండ్ ఏఎన్‌ఎంలు 162మంది బుధవారం నుంచి సమ్మె బాట పట్టారు. 1,520 ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టుల భర్తీకి గత నెల 26న వెలువడిన నోటిఫికేషన్‌లో వంద మార్కులకు గాను ప్రస్తుతం పని చేస్తున్న వారికి 20 మార్కుల వెయిటేజీ ఇచ్చారు. వయో పరిమిది 44సంవత్సరాలు పేర్కొనగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు సడలింపు ఇచ్చారు. దీంతో కాంట్రాక్టు సర్వీసుల్లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎం, ఈసీ ఏఎన్‌ఎం, అర్బన్ హెల్త్‌సెంటర్ల ఏఎన్‌ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్‌ఎంలు, 104వాహనాల్లోని ఏఎన్‌ఎంలు సమ్మెలో పాల్గొంటున్నారు. కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు అవకాశం కల్పించినా గతంలో వీరంతా డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై పని చేస్తున్నవారే. గతంలో ఎంపికైన వారిని మరోసారి పరీక్ష రాయలనడం సరికాదని, ఇప్పటికే 20ఏళ్లుగా పని చేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి వయస్సు సరిపోదని, వీరందరినీ ఖాళీ పోస్టులు సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వైద్యారోగ్యశాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారని, కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లకు మెరిట్ ఆధారంగా సర్వీసు వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ చేసినట్లు చెబుతున్నారు. 2016లో ఇచ్చిన జీవో 16 ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి 68మంది కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(ఎఫ్)లను రెగ్యులర్ చేశారు. మిగతా 162మందిని సీనియారిటీ ప్రకారం ఖాళీ పోస్టుల్లో రెగ్యులర్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. జిల్లాలో కుష్ఠువ్యాధి సర్వేతోపాటు బోదకాల నివారణ మాత్రల పంపిణీ, ఇంద్రధనుష్, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ఏఎన్‌ఎంల సమ్మెతో ఆయా కార్యక్రమాల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది.

డిమాండ్లు ఇవే..

- 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.31,040, డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు ఇవ్వాలి. పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి.
- వ్యాక్సిన్ అలవెన్స్ రూ.500, యూనిఫాం అలవెన్స్ రూ.2,500 ఇవ్వాలి.
- 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలి.
- నైట్‌డ్యూటీలు, ఓపీ డ్యూటీలు రద్దు చేయాలి. బదిలీకి అవకాశం కల్పించాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.
- ఫీల్డ్ డ్యూటీ చేస్తున్నందున ఎఫ్‌టీఏ సౌకర్యం కల్పించాలి.

రెగ్యులరైజ్ చేయాలి



గత 20 ఏళ్లకు పైగా కాంట్రాక్టు పద్ధతిలో సెకండ్ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారిని కాదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఏఎన్‌ఎంల నియామకం కోసం నోటిఫికేషన్ వేసింది. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు మాకు అవకాశం కల్పించినా, అందుకు సరిపడా వయస్సు అర్హత లేని వారు ఉన్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వం కోసం పనిచేస్తున్న తమనే రెగ్యులర్ చేయాలి.

– బోనగిరి పద్మ, కాంట్రాక్టు ఏఎన్‌ఎం

మెరిట్ ఆధారంగానే ఎంపిక



తమను కాంట్రాక్టు సెకండ్ ఏఎన్‌ఎంలుగా తీసుకునేందుకు ప్రభుత్వం గతంలోనే మెరిట్ ప్రకారంగానే ఎంపిక చేసింది. ఇన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగించి అన్ని పనులు చేయించారు. నోటిఫికేషన్ రద్దు చేసే వరకు సమ్మె కొనసాగిస్తాం.

– ఎస్.మంజుల, కాంట్రాక్టు ఏఎన్‌ఎం

రేపే చివరి రోజు

- మద్యం దుకాణాలకు పోటాపోటీ
- 588 దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుకు రెండ్రోజులే గడువు ఉంది. 2023–25 సంవత్సరానికి గాను కొత్త మద్యం పాలసీ అమలుకు ప్రభుత్వం ఈ నెల 4నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా.. ఈ నెల 18నాటితో ముగియనుంది. ఈ నెల 21న లక్కీ డ్రా పద్ధతిలో మద్యం దుకాణాల ఎంపికకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని 73 దుకాణాలకు బుధవారం వరకు 588 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది 1194 దరఖాస్తులు రాగా.. గతంలో సైతం చివరి రెండ్రోజుల్లోనే ఆశించిన వాటి కంటే ఎక్కువగా వచ్చాయి. ఈసారి సైతం 17, 18వ తేదీల్లో గతంలో కంటే రెట్టింపు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో దుకాణం దరఖాస్తుకు రూ.2లక్షలు కాగా.. ఈ డబ్బు డ్రాలో దుకాణం దక్కకపోయినా తిరిగి రాదు. అయినప్పటికీ మద్యం వ్యాపారంలో మంచి లాభాలు వస్తాయనే ఆశతో ప్రతీసారి పెద్దమొత్తంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈసారి ఎన్నికలు రాబోతున్నందున మద్యం అమ్మకాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుంది. దీంతో భారీగా దరఖాస్తులు వచ్చి రెట్టింపు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎక్కువ అమ్మకాలు జరిగే ప్రాంతాలపై దృష్టి

జిల్లాలో అధికంగా మద్యం అమ్మకాలు జరిగే దుకాణాలపై వ్యాపారులు దృష్టి సారించారు. గతంలో జరిగిన అమ్మకాలు, వచ్చిన ఆదాయం తెలుసుకుంటున్నారు. ఆ దుకాణాలు దక్కించుకుంటే అదృష్టలక్ష్మి వరిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్దగా సాగకపోవడంతో చాలామంది రియల్టర్లు మద్యం వ్యాపారంలో అడుగుపెట్టేందుకు యోచిస్తున్నట్లు సమాచారం.

సిండికేటుగా ఏర్పడి..

వరుసగా అసెంబ్లీ, పార్లమెంటు పంచాయతీ, మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో దుకాణాలకు పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది. కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు వేయడానికి సిద్ధం అవుతున్నారు. దీంతో ప్రభుత్వానికి గతం కంటే రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఇతర వ్యాపార వర్గాలకు చెందిన వారు అధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. పైగా ఎలాంటి పైరవీలు అవకాశం లేదని, డ్రా పద్ధతిలో ఎంపిక ఉండడంతో వ్యాపారంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

రిజర్వేషన్	కేటాయించిన దుకాణాలు	వచ్చిన టెండర్లు
ఎస్సీ	10	51
ఎస్టీ	06	18
గౌడ్స్	06	43
ఓపెన్	51	476
మొత్తం	73	588

సదరం శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: దివ్యాంగుల ధ్రువీకరణ పొందడానికి అర్హులు ఈ నెల 23, 25, 29 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం కాల పరిమితి పూర్తయిన వారు పునరుద్ధరణ, నూతన పత్రాల కోసం సకాలంలో హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 23న శారీరక వికలాంగులు, 25న కంటి చూపు సమస్యలున్నవారు, 29న మానసిక దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తారని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'మన బడి' పనులు పూర్తి చేయాలి

నస్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం స్థానిక సమీకృత కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో బెల్లంపల్లి, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి, హాజీపూర్ మండలాల అసిస్టెంట్ ఇంజినీర్, డీఈలతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 248 పాఠశాలలు ఎంపిక చేశామని అన్నారు. అదనపు తరగతి గదులు వంటశాల, భోజనశాల, ప్రహరీ, మూత్రశాలలు, తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.యాదయ్య, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

సుడిగాలి పర్యటన



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న రాహుల్

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. నర్సింగాపూర్ గ్రామంలోని డంపింగ్‌యార్డు పరిశీలించారు. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. కాజిపల్లి, బూర్గుపల్లి గ్రామాలను సందర్శించారు. పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించవద్దని కార్యదర్శులను ఆదేశించారు. కాజిపల్లిలోని రికార్డులను పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌రెడ్డి, సర్పంచులు దాడి తిరుపతి, దుర్గం మల్లేశ్, రమాదేవి పాల్గొన్నారు.

పరుగు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మిడిల్ డిస్టెన్స్, లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ ఎంపిక పోటీలు ఈ నెల 18న కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, ఈ.మారయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు 600 మీటర్లు, 16 ఏళ్లలోపు బాల బాలికలకు 800మీటర్లు, 2000 మీటర్లు, 18ఏళ్లలోపు బాలబాలికలకు 800 మీటర్లు, 1,500 మీటర్లు, 3 వేల మీటర్లు, 20 ఏళ్లలోపు బాలబాలికలకు 800 మీటర్లు, 1,500 మీటర్లు 3 వేల మీటర్లు, 5 వేల మీటర్లు పోటీలు ఉంటాయని తెలిపారు. పురుషులు, మహిళలకు 800 మీటర్లు, 1,500 మీటర్లు, 3 వేల మీటర్లు, 5 వేల మీటర్లు, 10 వేల మీటర్ల పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని 18న ఉదయం 7:30 గంటలకు రిపోర్టు చేయాలని, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్ 7207007012 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు.

పరేడ్ మైదానంలో 'పరేషానీ'!



అసలే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు. ఆపై డ్రైడే.. అయినా మందుబాబులకు మాత్రం వేరే అడ్డా కనిపించలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంబురాలకు వేదికగా నిలిచిన మంచిర్యాల పరేడ్ మైదానం రాత్రి మందుబాబుల మజాకు కేరాఫ్‌గా మారింది. పరేడ్ మైదానంలో బుధవారం ఉదయం వాకింగ్, యోగా, ఫిట్‌నెస్, పలు క్రీడల్లో శిక్షణకు వచ్చిన వారికి బీరు, మందు బాటిళ్లు దర్శనమిచ్చాయి. అక్కడక్కడ పగిలిన బీరు సీసాల ముక్కలు కనిపించడంతో ఇదేం 'పరేషానీ' అంటూ విస్తుపోయారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని లింగాపూర్ శివారులో బుధవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. వంద లీటర్ల బెల్లం పానకం పారబోశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు అశోక్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

చింతలమానెపల్లి: మండలంలోని చీపురుదుబ్బ శివారులో పంటను ధ్వంసం చేసిన ఎల్ములె నాందేవ్, టాకిరె రమేశ్‌లపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన పిప్రె శ్రీనివాస్‌కు చీపురు దుబ్బ శివారులో వరి సాగు చేస్తున్నాడు. ఈ నెల 14న ఎల్ములె నాందేవ్, టాకిరె రమేశ్ అక్రమంగా పిప్రె రమేష్ భూమిలోకి వచ్చి పంటను, భూమి హద్దులను ధ్వంసం చేశారు. బాధిత రైతు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ తీగలు అమర్చిన ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: పంట చేనుకు రక్షణగా విద్యుత్ తీగలు అమర్చిన కెరమెరి మండలంలోని పాటగూడకు చెందిన ఆత్రం రామును బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈ నెల 12న రాము పంట చేనుకు రక్షణగా అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి కాకడ్‌బోడ్డి గ్రామానికి చెందిన సిడాం మారు (23) మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కెరమెరి ఎస్సై గుంపుల విజయ్ ఉన్నారు.

ఇద్దరికి రెండేళ్ల జైలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని ఎల్లారంకు చెందిన శేఖర్, మొగిలికి స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. 2017లో గ్రామానికి చెందిన పింగిళి రమేశ్‌తో గొడవ పెట్టుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు నేరం రుజువు కావడంతో బుధవారం కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు.

శ్రావణం.. శుభప్రదం



శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు చేయనున్న చెన్నూర్ శివాలయం

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- శివుడికి అత్యంత ప్రీతికరం
- అన్నీ ప్రత్యేకమైన రోజులే..
- ఆలయాల్లో మంగళగౌరీ, వరలక్ష్మీ వ్రతాలు

చెన్నూర్: హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో శివుడి ఆరాధాన మేలు చేస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ మాసంలో శివుడు, మహావిష్ణువు, లక్ష్మీదేవిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఈ నెలలో చేసే పూజలు, వ్రతాలు శుభ ఫలితాలను ఇస్తాయని భక్తుల నమ్మకం. ఇదే మాసంలో వరలక్ష్మీ, మంగళ గౌరీ వ్రతాలు, నాగపంచామి, రాఖీ పౌర్ణమి, పొలాల అమావాస్య లాంటి ముఖ్యమైన పండుగలు వస్తాయి. ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం బుధవారంతో ముగిసింది. ఈ నెల 17 గురువారం నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభంకాగా సెప్టెంబర్ 15 శుక్రవారంతో ముగియనుంది.

వ్రతాలకు ప్రత్యేకమైన మాసం

మహిళలు పాటించే వ్రతాలు అధికంగా ఈ మాసంలోనే ఉన్నాయి. ఈ మాసాన్ని వ్రతాల మాసమని, సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసమని కూడా అంటారు. ఈ మాసంలో ప్రతీ ఇళ్లు ఆలయాన్ని తలపిస్తుంది. ఎంతో పవిత్రమైన శ్రావణమాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో నెలరోజులపాటు శివాలయాలు ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మారుమ్రోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు.

హిందూ పంచాంగం ప్రకారం..

హిందూ పంచాంగంలో ప్రతీ మాసానికి ఒక ప్రత్యేకత ఉంది. వాటిలో శ్రావణమాసం ఒకటి. చాంద్రమానం ప్రకారం ఐదవ మాసం. ఈ మాసంలో పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రానికి సమీపంలో ఉంటాడు. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం. అటువంటి శ్రవణా నక్షత్రం పేరుతో ఏర్పడిన శ్రావణ మాసం శ్రీమహావిష్ణువు పూజకు ప్రత్యేకత సంతరించుకున్న మాసం. శ్రావణ మాసంలో మంగళ, శుక్ర, శనివారాలు అంత్యంత ప్రధానమైనవిగా పరిగణిస్తారు. మంగళవారం శ్రీగౌరీ పూజకు, శుక్రవారం లక్ష్మీ పూజకు, శనివారం శ్రీ మహావిష్ణువు పూజకు ముఖ్యమైన రోజులుగా వేదపండితులు పేర్కొంటున్నారు.

ఈ ప్రాంతానికి ప్రత్యేకత



చెన్నూర్‌లో గల గోదావరి నదికి కాశీ అంతటి ప్రాముఖ్యత ఉంది. కాశీలోని గోదావరినది ఉత్తర దిశగా రెండు కోశుల దూరం ప్రవహిస్తుండగా చెన్నూర్ గోదావరినది ఉత్తర దిశగా ఐదు కోశుల దూరం ప్రవహిస్తుంది. అందుకే చెన్నూర్ గోదావరినదికి పంచకోశ ఉత్తర వాహిని అని పేరుంది. అలాగే ఆగస్త్యా మహాముని ప్రతిష్టించిన శివలింగం చెన్నూర్‌లో ఉంది. అందుకే ఈ మాసంలో గోదావరినదిలో స్నానం అచరించి శివాలయంలో పూజలు చేస్తే శుభం కలుగుతుందని అనాదిగా వస్తున్న ఆచారం.– వేమారం మహేశ్వరశర్మ, శివాలయ అర్చకులు, చెన్నూర్

ఇంటి నంబర్ల మాయాజాలం

- పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ ఇళ్ల నంబర్ల మాయాజాలానికి కేంద్రంగా మారింది. ఓపెన్‌కాస్టు ముంపు పరిహారం కోసం దూరదృష్టితో కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టగా అనుమతులు, నంబర్ల కేటాయింపు, తారుమారు కావడం వివాదాస్పదంగా మారుతోంది. వచ్చే ఏడాది ఈ ప్రాంతంలో మహావీర్‌ఖని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు ఏర్పాటవుతుందనే ప్రచారంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి విడిపోయిన మాదారం 3ఇంక్లైన్ కొత్త పంచాయతీగా ఏర్పడింది. దశాబ్దాల కాలంగా గ్రామంలో నివసిస్తున్న కొందరి ఇళ్ల నంబర్లు ఆన్‌లైన్‌లో గల్లంతయ్యాయి. మరికొందరి ఇళ్ల నంబర్లు ఇతరుల పేరిట మార్పు జరిగాయి. ఈ విషయం బహిర్గతం కావడంతో గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సాధుల్లా, సర్పంచ్ గాజుల సుజాత భర్త శ్రీనివాస్‌ను నిలదీశారు. ఇష్టారీతిన ఆన్‌లైన్‌లో ఇళ్ల నంబర్లు మార్చడం, కొత్తగా నిర్మించుకున్న వారికి పాత వారి ఇంటి నంబర్లు కేటాయించడం, పాత వారికి కొత్త నంబర్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసీపీ ముంపు జాబితాలో పాత ఇళ్ల జాబితాను పరిగణనలోకి తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు.

పెరిగిన ఇళ్ల సంఖ్య

పంచాయతీ ఏర్పడిన సమయంలో 240 ఇళ్లకు నంబర్లు కేటాయించి ఉండగా.. తాజాగా ఆసంఖ్య 412కు చేరింది. ముంపు పరిహారం కోసం ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా పంచాయతీ అధికారులు నంబర్లు కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలోనూ ఇళ్ల నంబర్ల కేటాయింపు వివాదం తలెత్తడంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సదరు కార్యదర్శిపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ వివాదం సద్దుమణగక ముందే మళ్లీ మరో వివాదం తెరపైకి వచ్చింది. జాబితాను సరి చేసి గ్రామస్తులకు అన్యాయం జరగకుండా చూడాలని మాజీ ఎంపీటీసీ రెబ్బెన రాంచందర్ కోరారు. ఈ విషయమై ఎంపీవో సత్యనారాయణ స్పందిస్తూ తాజాగా మళ్లీ ఇంటి నంబర్లు మార్చినట్లు తెలిసిందని, విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ఎవరికీ నష్టం కలుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- తన ఇంటి నంబరును మార్చడంపై అధికారులను ప్రశ్నిస్తే అది సమస్య కాదని అంటున్నారని, మిగతా ఆధారాలు ఎలా మార్చుకోవాలని గ్రామస్తుడు జే.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- గ్రామంలోని బోర్లకుంట పార్వతికి గూనపెంకుల ఇళ్లు 167 అసెస్‌మెంటుతో ఉండగా ఇంటి నంబరు 10–49 కేటాయించారు. మూడు దశాబ్దాలుగా ఇంటి పన్ను చెల్లిస్తోంది. ప్రస్తుతం ఆ అసెస్మెంటు నంబరు మేరుగు మల్లేశ్వరికి కేటాయించారు. పార్వతి పేరుపై 2021 నుంచి ఇల్లు ఉన్నట్లు, ఒకసారి మాత్రమే పన్ను కట్టినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో చూపించడంతో లబోదిబోమంటూ న్యాయం చేయాలని వేడుకుంటోంది.

ఆర్కే 5గనిని సందర్శించిన అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిని బుధవారం కోలిండియా అధికారుల బృందం సందర్శించింది. సీనియర్ మేనేజర్ అంజనీకుమార్, డెప్యూటీ మేనేజర్ నందకిషోర్‌యాదవ్, సర్వేయర్ నసీంపర్వేజ్, జేబీసీసీఐ మెంబర్ లఖన్ లాల్‌మహతోలతో కూడిన బృందం గనిలోకి దిగి పని ప్రదేశాలను పరిశీలించింది. ఎత్తు తక్కువ ఉన్న సీములలో బొగ్గు ఉత్పత్తికి సంస్థ అనుసరిస్తున్న విధానాలను ఆర్కే 5 అండ్ 6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డితో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, పిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, సర్వేయర్ లక్ష్మణ్, కిరణ్, ఇందారం ఓసీ పీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



గని వద్ద కోలిండియా అధికారుల బృందం

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై విచారణ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోనిప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 13న అవుట్ సోర్సింగ్ సిబ్బంది రోగుల వద్ద డబ్బులు అడుగుతున్నారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సూపరింటెండెంట్ శ్రీనివాస్ సిబ్బందిని తొలగించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్ అధికారి కోటేశ్వర్ దీనిపై విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా వైద్యాధికారి అరవింద్‌కు అందజేస్తామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



విచారణ చేపడుతున్న కోటేశ్వర్

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓస్ కాలనీలో నివాసం ఉంటున్న పడోరె తుకారాం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న తుకారాం మూడు రోజులుగా కనిపించడంలేదు. బుధవారం ఇంటి సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంట్లోకి వెళ్లిచూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. మృతదేహానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య



పర్వతాలు (ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన రాస పర్వతాలు (76) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం పర్వతాలు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: ఈనెల 15న 'యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ కట్టడాన్ని బుధవారం బ్లేడు ట్రాక్టర్‌తో కూల్చివేయించారు. నస్పూర్ శివారు సర్వే నంబర్ 64లోని సుమారు 19 గుంటల ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా రెడీమేడ్ ప్రహారీ ఏర్పాటు చేశారు. విచారణ జరిపిన అధికారులు సదరు కట్టడాన్ని కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇర్ఫాన్‌ఖాన్ పఠాన్ మాట్లాడుతూ కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల ఆర్డీవో రాములు ఆదేశాల మేరకు కట్టడాన్ని కూల్చి వేయించామన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కూల్చివేయిస్తున్న అధికారులు

బీఎస్పీ నాయకుడిపై దాడి సరికాదు

తాండూర్: బీఎస్పీ నాయకుడిపై బీఆర్‌ఎస్ యూత్ శ్రేణుల దాడి సరికాదని, దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కాసిపేట గ్రామానికి వెళ్లి గాయపడిన వరప్రసాద్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి వెనుక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, రాజులాల్ యాదవ్, నవీన్, నర్సింగ్, శ్రావణ్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న కొయ్యల ఏమాజీ

బాధితులకు పరామర్శ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేటకు చెందిన జంగం లక్ష్మి, నీరటి రామమ్మలను బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ బృందం సభ్యులు కలిసి వివరాలు సేకరించారు. ఈ నెల 6న ఓ భూమి విషయంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె గురువయ్య, లక్ష్మి ఇరువురు కలిసి రామమ్మ, లక్ష్మిలను రాజీకి పిలిపించి కులం పేరుతో దూషిస్తూ ఇనుప పైపులతో దాడి చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుని తగు న్యాయం జరిగే విధంగా చూస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో సభ్యులు జిల్లపల్లి వెంకటేశం, బచ్చల అంజన్న, రేగుంట లింగయ్య ఉన్నారు.



పాముకాటుతో యువకుడి మృతి



రాజు (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన ధనూరి రాజు(24)పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు...



రాందాస్ (ఫైల్)

సిర్పూర్(టి): ఈ నెల 11న పాముకాటుకు గురైన సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంకు చెందిన ఎల్ములే రాందాస్(34) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాందాస్ ఈనెల 11న గ్రామ సమీపంలోని పంట చేనుకు నీళ్లు పెట్టేందుకు కూలి పనులకు వెళ్లగా పాము కాటువేసింది. పక్కనే ఉన్న భోయిరే సాయినాథ్‌కు తెలపడంతో సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నను చూసేందుకు వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



షకీల్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: అన్నను చూసేందుకు వెళ్లి తమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హడ్కోకాలనీకి చెందిన షకీల్ (20) కాగజ్‌నగర్‌లో ఉన్న తన సోదరుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసేందుకు బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వంకులం సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఐచర్ వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అరగంటసేపు ఎవరూ పట్టించుకోకపోవడంతో చికిత్సకు ఆలస్యం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహానికి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఐచర్ వ్యాన్ డ్రైవర్‌పై రెబ్బెన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.


బెదిరింపుల కేసులో జరిమానా

జైపూర్(చెన్నూర్): చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురికి రూ.12 వేల జరిమానా విధిస్తూ జడ్జి సంపత్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దండె అమృతమ్మ, రాజయ్య దంపతులు 2018, ఆగస్టు 1న తమ పంటచేనులో గడ్డి తీస్తుండగా కోడలు దండె వర్షిత, ఆమె తండ్రి కామ వెంకటి, తల్లి చంద్రమ్మ అక్కడి వెళ్లి భూమి పంచి ఇవ్వమని గొడవకు దిగారు. రాజయ్యను కర్రతో కొట్టి చంపుతామని బెదిరించడంతో అమృతమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చెన్నూర్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత ద్వారా సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితులకు రూ.12వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఈసారికి 'ఇంజనీరింగ్' లేనట్టే!

- జేఎన్టీయూ కాలేజీ ఇస్తామని నిర్మల్ సభలో సీఎం కేసీఆర్ హామీ
- పాలేరు, మహబూబాబాద్‌లలో 300 సీట్ల చొప్పున ప్రారంభం
- ఉమ్మడి జిల్లాకు ఉత్త చెయ్యేనా?

నిర్మల్: గత జూన్ 4న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకతపై 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అదేరోజు నిర్మల్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం కేసీఆర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాకు ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఉమ్మడి జిల్లాకు జేఎన్టీయూ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది ఎక్కడ ఉండాలో మంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. ఈ విద్యాసంవత్సరమే తరగతులు ప్రారంభమవుతాయని అప్పట్లో అధికార పార్టీవర్గాలూ పేర్కొన్నాయి. కానీ.. ఇంతవరకు ఆ ఊసే లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.



కొత్తగా రెండు ప్రారంభం..

జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో తాజాగా రెండు కొత్త కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా పాలేరు, మహబూబాబాద్‌లో ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్నారు. ఒక్కోచోట సీఎస్ఈ, సీఎస్ఈ (డేటాసైన్స్), ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఈ ఐదు బ్రాంచీలు మంజూరయ్యాయి. ఒక్కో బ్రాంచీకి 60సీట్ల చొప్పున కాలేజీకి మొత్తం 300సీట్లు కేటాయించారు. ప్రత్యేక విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ విడత ద్వారా కొత్త కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇక రెండేళ్ల క్రితమే వనపర్తి, సిరిసిల్లలో జేఎన్టీయూ కాలేజీలు ప్రారంభించారు. ఇప్పటికే జగిత్యాల, మంథని, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలు నిర్వహిస్తోంది.

ఇక్కడ అవసరం..

ఇంటర్ పూర్తి కాగానే ఉమ్మడి జిల్లాకు చెందిన చాలామంది విద్యార్థులు ఇంజనీరింగ్ వైపు వెళ్తున్నారు. హైదరాబాద్‌లాంటి దూరప్రాంతాలకు వెళ్లి చదవాల్సి వస్తోంది. ఆర్థికంగా తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. స్థానికంగా డిగ్రీలో కూడా ఉపాధినిచ్చే ప్రత్యేక కోర్సులు లేకపోవడం, పీజీ కాలేజీ కూడా అందుబాటులోకి రాక తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక సాఫ్ట్‌వేర్ సంస్థలే జిల్లాల బాట పడుతున్న ప్రస్తుత తరుణంలో స్థానికంగా ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వస్తోంది. సీఎం కేసీఆర్ జిల్లాకు మంజూరు చేస్తున్నట్లు ఇచ్చిన హామీ మేరకు త్వరలో కళాశాల ప్రారంభమయ్యేలా చూడాలన్న డిమాండ్ పెరుగుతోంది.

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి

- ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ

మందమర్రిరూరల్(చెన్నూర్): ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఆయన వెంట మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ చెన్నూరి శ్రీనివాస్, పట్టణ ఇన్‌చార్జి జీడి సారంగం, నాయకులు పెరిక నర్సయ్య, సుగుణాకర్, విష్ణు, కిరణ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సోమశేఖర్ మాదిగ

నీటికుంటలో పడి యువకుడి మృతి

తలమడుగు: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన మాధవి శేఖర్(22) గ్రామ సమీపంలోని నీటి కుంటలో పడి మృతిచెందాడు. శేఖర్ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లాడు. నీటి కుంట వద్ద ఫిట్స్ రావడంతో నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.